నమస్తే తెలంగాణ

# 1200 ఆస్తుల సేకరణ

## 7.5 కి.మీతో పాతనగరం మెట్రో

**భూసేకరణ వేగవంతం..8 నెలల్లో ప్రక్రియ పూర్తికావొచ్చు**

**400 ఆస్తుల సేకరణకు నోటిఫికేషన్లు జారీ**

**మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి**





సిటీబ్యూరో, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): పాతనగరంలో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణ గుట్ట వరకు నిర్మిస్తున్న మెట్రో మార్గం కోసం భూసేకరణ వేగంగా జరుగుతోందని హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఎంజీబీఎస్ వరకు ఉన్న మార్గాన్ని పాతనగరం మీదుగా చాంద్రాయణగుట్ట వరకు సుమారు 7.5 కి.మీ మేర నిర్మిస్తున్నామని, ఇందు కోసం సుమారు 1200 ఆస్తులను సేకరించాల్సి ఉంటుందని చెప్పారు. భూసేకరణ చట్టం-2013 కింద 400 ఆస్తులకు సంబంధించిన భూసేకరణ నోటిఫికేషన్లు జారీ చేశామని చెప్పారు. వివిధ పత్రికల్లోనూ ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్లు ఇచ్చి ఆస్తులను సేకరించే ప్రక్రియను వేగవంతం చేశామన్నారు. జీహెచ్ఎంసీ మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగుల వెడల్పుతో రహదారి విస్తరణ జరుగుతున్నదన్నారు. అదేవిధంగా మెట్రో స్టేషన్లు నిర్మించే ప్రాంతాల్లో మాత్రం రోడ్డు 120 అడుగుల వెడల్పుతో విస్తరణ చేపట్టాల్సి ఉంటుందని ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. దారుల్ షిపా జంక్షన్ నుంచి శాలిబండ వరకు ప్రస్తుతం రోడ్డు వెడల్పు 50 అడుగుల నుంచి 60 అడుగుల వరకు, శాలిబండ జంక్షన్ నుంచి చాంద్రాయణగుట్ట జంక్షన్ వరకు 80 అడుగులు ఉందన్నారు. అందువల్ల దారుల్‌షిపా-శాలిబండల మధ్య చాలా ఆస్తుల విషయంలో ఒక్కొక్కటీ 20-25 అడుగుల చొప్పున విస్తరణ చేయాల్సి ఉంటుందని, అలాగే శాలిబండ నుంచి చాంద్రాయణ గుట్ట వరకు ఒక్కో ఆస్తిని 10 అడుగుల వరకు విస్తరణ చేయాల్సి ఉంటుందని వివరించారు. మెట్రో స్టేషన్లు, వంపులు అధికంగా ఉన్న ప్రాంతాల్లోని ఆస్తుల విషయంలో మాత్రం రహదారి విస్తరణ కాస్తా ఎక్కువగా ఉంటుందన్నారు.

### మెట్రో మార్గంలో సర్వే..

సాంప్రదాయంగా వస్తున్న సర్వే పద్ధతులతో పాటు 3డీలో వీక్షించే విధంగా లైడార్ డ్రైన్ సర్వే సైతం చేసినట్లు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. దీనివల్ల ప్రభావితమయ్యే ఆస్తులతో పాటు చుట్టు పక్కల ఉన్న ఆస్తులను కూడా వీక్షించవచ్చన్నారు. ప్రభావిత నిర్మాణాల విలువను అంచనా వేసేందుకు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ఇంజినీర్లు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. 7.5 కి.మీ మేర నిర్మించే మెట్రో కారిడార్‌లో 103 మతపరమైన, సున్నితమైన కట్టడాలు ఉన్నాయని, వాటి పరిరక్షణ విషయంలో అదనపు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. భూసేకరణ చట్టం అనుసరించి చేపడుతున్న ఈ భూసేకరణ కార్యక్రమం 8 నెలల్లో పూర్తి కావచ్చని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు.